# పద్యాస్త్రం ప్రయోగించిన వేమన

పెదనందిపాడు: సమాజంలో వేళ్లూనుకున్న రుగ్మతలపై పద్యాస్త్రాన్ని ప్రయోగించిన సామాజిక విప్లవకారుడు వేమన అని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహన్‌రావు అన్నారు. గురువారం సాయంత్రం పెదనందిపాడు శాఖ గ్రంథాలయంలో యోగి వేమన జయంత్యుత్సవం సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న మోహన్‌రావు మాట్లాడుతూ పండిత లోకానికి పరిమితమైన వేదాంతాన్ని పామరులకూ అర్థమయ్యే రీతిలో సరళమైన పదాలతో స్వచ్ఛమైన అచ్చమైన తేనెలాంటి తేటతెలుగు పద్యాలతో వివరించిన మహానుభావుడు వేమన అని కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు గుగ్గిలం సాయిబాబు, గారపాటి రమష్, గ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిణీ, కొలగాని మంజుల, గేరా రామస్వామి, మాబుసుభాని, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

**రెడ్డి సంఘం ఆధ్వర్యంలో..**

గుంటూరు రూరల్: ప్రపంచ సాహిత్యంలో మొట్టమొదటి అభ్యుదయ కవి యోగి వేమన అని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో యోగి వేమన జయంత్యుత్సవం నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సంఘం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ తెలుగు ప్రజలకు అభ్యుదయ సాహిత్యాన్ని అందించిన మహాకవి యోగి వేమన అని, ఆయనను స్మరించుకోవటం మన అదృష్టమని పేర్కొన్నారు. అభ్యుదయ తెలుగు కవిత్వానికి వేమన, గురజాడ మూలపురుషులన్నారు. వీరితోపాటు గుర్రం జాషువా పద్య కవిత్వానికి మంచి ప్రేరణ అని తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కె.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు ఇంటూరి సాంబశివారెడ్డి, జి.శ్రీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఏపీ రెడ్డి సంఘం సభ్యులు

# చివరి ఎకరాకూ నీరందిస్తాం

**జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శివరామకృష్ణ**

పెదనందిపాడు: ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని, రైతులు ఎవరూ ఇబ్బంది పడకుండా చివరి ఎకరాకూ సాగునీరు అందించనున్నట్లు గుంటూరు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ చెప్పారు. గురువారం మధ్యాహ్నం పెదనందిపాడు ఎత్తిపోతల పథకాన్ని సందర్శించిన శివరామకృష్ణ మాట్లాడుతూ పెదనందిపాడు, కత్రపాడు, నాగులపాడు, కొమ్మూరు, గార్లపాడు, కాకుమాను, పుసులూరు, కొండపాటూరు గ్రామాలకు ఈ పథకం ద్వారా సాగునీరు అందుతుందని, ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో ఈ ప్రాంతాలలో మొక్కజొన్న ఎక్కువ సాగు చేస్తున్నారని ఆయన చెప్పారు. మొక్కజొన్నకు సాగునీరు అవసరమని ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత సూచనల మేరకు ఎత్తిపోతల పథకంలో ఉన్న ఆరు మోటార్లను సుమారు 2,50,000 రూపాయలతో మరమ్మతులు చేయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ వ్యవసాయ సీజన్‌లో నిరంతర విద్యుత్ సరఫరాతో మోటార్ల ద్వారా మొక్కజొన్నకు అవసరమైన సాగునీరు సరఫరా చేయనున్నట్లు వివరించారు. అనంతరం మరమ్మతు పనులను పరిశీలించి ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.


మోటార్ల మరమ్మతు పనులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శివరామకృష్ణ

# జొన్నలగడ్డలో పొలంబడి

గుంటూరు రూరల్: పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు వివరించి రైతులను నిష్ణాతులను చేయటమే పొలంబడి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ. సుబ్రమణ్యం తెలిపారు. గురువారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మిత్ర పురుగులను రక్షించి, పంటల్లో నష్టాన్ని కలిగించే పురుగుల నివారణ చర్యల గురించి వివరించారు. శనగ పంట చుట్టూ నాలుగు వరుసల్లో జొన్న, మొక్కజొన్న వంటి ఎత్తుపెరిగే రక్షణ పైర్లు నాటుకోవటం వల్ల రసంపీల్చే పురుగుల ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. అలాగే పంటల్లో అక్కడక్కడ ఆముదం, బంతి, వంటి ఆకర్షణ మొక్కలను సాగు చేసి గొంగళి పురుగుల ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. శనగ పంటల్లో శనగపచ్చ పురుగుల ఉధృతిని తగ్గించుకునేందుకు లింగాకర్షక బుట్టలను ఎకరానికి 10 ఏర్పాటు చేయాలని రైతులకు సూచించారు. పురుగుల ఉధృతిని బట్టి రసాయన ఎరువులను పిచికారీ చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి యాజమాన్య పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో రైతులు గ్రామ ఉపసర్పంచ్ వంగా నవీన్‌రెడ్డి, నామా శ్రీనివాసరావు పాల్గొన్నారు.


క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి సుబ్రమణ్యం తదితరులు

## క్లుప్తంగా

### రేపు 'బజరంగ్ ఫౌండేషన్' ఉచిత కంటి వైద్య శిబిరం

పెదకాకాని: బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ చెప్పారు. శనివారం పెదకాకానిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పెదకాకాని వీరమ్మ పేరంటాళ్ళు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి బజరంగ్ నేత్రజ్యోతి ద్వారా ఉచితంగా కళ్ళజోళ్లు పంపిణీ చేస్తామని వివరించారు. థలసేమియా రోగులకూ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. వలంటీర్లకు అవగాహన, పోటీ పరీక్ష నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. స్కూల్‌కు వెళ్ళే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు ఉచితంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. వలంటీర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ కోరారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



చేబ్రోలు: ప్రమాదవశాత్తూ రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనటంతో ఇద్దరికి గాయాలైన ఘటన చేబ్రోలు మండలం వడ్లమూడిలో గురువారం జరిగింది. ఒడిశా రాష్ట్రానికి చెందిన బిపిన్ మాలిక్ సంగం జాగర్లమూడి ప్రాంతంలో హోటల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వడ్లమూడికి వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బిపిన్ మాలిక్‌తోపాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. బిపిన్ మాలిక్‌ను 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్వల్పంగా గాయపడిన మరో యువకుడు వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### హోంగార్డు కుటుంబానికి చెక్కు పంపిణీ



నగరంపాలెం: గుంటూరు జిల్లా హోంగార్డు విభాగంలో విధులు నిర్వర్తించిన బాల గత నెలలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు ఫ్లాగ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.10 వేల చెక్కుని బాల భార్య దేవమణికి గురువారం జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో మినిస్ట్రీయల్ సిబ్బంది స్టీఫెన్, పవన్ పాల్గొన్నారు.

### టెక్స్‌టైల్ మిల్స్ సమస్యల పరిష్కారానికి కృషి



నెహ్రూనగర్: టెక్స్‌టైల్ మిల్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ సమావేశం చైర్మన్ లంక రఘురామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలుగా స్పిన్నింగ్ పరిశ్రమ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. ముఖ్యంగా విద్యుత్తు సబ్సిడీ బకాయిలపై ప్రభుత్వంతో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అసోసియేషన్ సమస్యల్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అప్పిరెడ్డి హామీ ఇచ్చారు.

### నాట్కో క్యాన్సర్ సెంటర్ సేవలు భేష్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో వైద్య సేవలు భేషుగ్గా ఉన్నాయని, అంతర్జాతీయ స్థాయికి తగినట్లుగా వైద్య సేవలు రోగులకు అందిస్తున్నారని పలువురు గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు పేర్కొన్నారు. గురువారం జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను 1971 గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు సందర్శించారు. క్యాన్సర్ రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి నాట్కో ట్రస్టు సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్ వారికి వివరించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ నీలం ప్రభావతిని కలిశారు. పూర్వ వైద్య విద్యార్థులు డాక్టర్ త్రిపురనేని రవికుమార్, డాక్టర్ వెనిగండ్ల బాలభాస్కర్ ఆధ్వర్యంలో పలువురు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దు

తెనాలి టౌన్: నేటి యువత ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దని, వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. పట్టణ గాంధీ చౌక్‌లో చందూస్ జిమ్‌లో గురువారం రాత్రి జరిగిన 12వ వార్షికోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిమ్ మేనేజింగ్ డైరెక్టర్ చందు వెంకటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. సభలో సబ్ కలెక్టర్ జిమ్ ఆవశ్యకత, ఆరోగ్యంపై ప్రభావం తదితర అంశాల్ని వివరించారు. జిమ్‌లో కొన్ని విభాగాలు అయిన చెస్ట్ ప్రెస్, బ్యాక్ స్క్వాడ్, ప్లాంక్ విభాగాల్లో చాంపియన్ షిప్‌లు సాధించిన మహిళలు, పురుషులకు మెడల్స్, సర్టిఫికెట్లను సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జెవీఎం హాస్పిటల్ ఎండీ డాక్టర్ జె.కోటి నాగయ్య, అమ్మ హాస్పిటల్ ఎండీ శివప్రసాద్, జిమ్ ఎండీ చందు వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో ప్రసాద్‌బాబు, విజయ్, మస్తాన్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్ అందజేస్తున్న సబ్ కలెక్టర్

# మెనూ ప్రకారం భోజనం అందించాలి

కొండపాటూరు(కాకుమాను): మారిన మెనూ ప్రకారం ప్రతిరోజూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ చెప్పారు. మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ఎంఈఓ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో అనేక మార్పులు తీసుకువచ్చినట్లు వివరించారు. మారిన మెనూ ప్రకారం రోజూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎంఈఓ మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శీలం అంకారావు తదితరులు ఉన్నారు.


మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈఓ కెనడీ, హెచ్‌ఎం అంకారావు

### క్షేమంగా ఇంటికి చేరిన కూలీలు

పెదకాకాని: మొక్కజొన్న పైరుకు గుళికలు వేసేందుకు వెళ్ళి అస్వస్థతకు గురైన కూలీలు ఆస్పత్రిలో చికిత్స పొంది క్షేమంగా గురువారం ఇంటికి చేరుకున్నారు. పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన 20 మంది కూలీలు నిడమర్రులో మొక్కజొన్న పైరుకు మొవ్వ పురుగు ఆశించకుండా గుళికలు వేసి బుధవారం అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. గుంటూరుకు చెందిన ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అనంతరం బుధవారం రాత్రి 17 మందిని డిశ్చార్జి చేశారు. వారిలో మిగిలిన ముగ్గురిని రాత్రి డాక్టర్ పర్యవేక్షణలోనే ఉంచారు. పూర్తిగా ఆరోగ్యం కుదుట పడటంతో గురువారం వారిని కూడా ఇంటికి పంపించారు. అందరూ క్షేమంగా ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, పొలం యజమాని ఊపిరి పీల్చుకున్నారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన వారిలో ముఠా మేస్త్రి కొణతం సామ్రాజ్యంతోపాటు కళ్యాణం శిల్పారాణి, కాసుల ధనలక్ష్మి, గోపిశెట్టి అంజమ్మ, లక్ష్మిశెట్టి కుమారి, ఆకరంశెట్టి కృష్ణవేణి, నందిపాటి అనమాయమ్మ, బత్తుల శీతారావమ్మ, పల్లెంపాటి నాగలక్ష్మి, పసుపులేటి శ్రీలక్ష్మి, పసుపులేటి శారద, ఆవుల సత్యవతి, పిన్నమనేని పద్మ, దంతాల స్వాతి, పుసుపులేటి సాంబ్రాజ్యం, పల్లెంపాటి అనంతకుమారి, గంగిశెట్టి అచ్చమ్మ, గోపిశెట్టి వెంకాయమ్మ, పల్లెంపాటి త్రివేణి, గంగిశెట్టి విజయ ఉన్నారు.

### వ్యక్తిని మోసం చేసిన సంస్థలపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తి రెండు సంస్థల్లో పెట్టుబడి పెట్టి మోసపోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడకు చెందిన బాలాజీ సింగ్ గుంటూరు లక్ష్మీపురంలో వివిధ స్కీంలు నడుపుతున్న సురక్ష సంస్థ, బ్రాడీపేటలోని ఆభరణ సంస్థల్లో రూ. 10 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. స్కీము నిబంధనల మేరకు రాబడులు లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

గార్లపాడు(కాకుమాను): గ్రామాలలో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు చెప్పారు. గార్లపాడులో గురువారం సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా గ్రామాలలో తాగునీటి సమస్య, పారిశుద్ధ్యం, సీసీ రోడ్ల నిర్మాణానికి మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కొమ్మాలపాటి రవి కుమార్, పార్టీ నాయకులు, గ్రామస్తులు ,గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నివాసరావు, మందిర వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

పాత గుంటూరు: సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డు 7వ లైనులోని శ్రీ సీతారామస్వామి మందిరంలో ఈనెల 20వ తేదీ నుంచి 24 వరకు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మందిర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కందిమళ్ల సాంబశివరావు, కార్యదర్శి కల్లి సుందరరామిరెడ్డి తెలిపారు. మందిర ఆవరణలో గురువారం మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో సుందరరామిరెడ్డి మాట్లాడారు. 20న సాయంత్రం 5 గంటలకు శ్రీవారి గ్రామోత్సవంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 6 గంటల నుంచి విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 21న ఉదయం 8 గంటల నుంచి వేద పారాయణాలు, యంత్ర పునఃశ్చరణ, హోమం, విశేష పూజా కార్యక్రమాలు, 22న ఉదయం 8 గంటల నుంచి వేద పారాయణాలు, ఏకాశీతి, పంచవింశతి, నవకలశ స్థాపన, తీర్థప్రసాద గోష్ఠి, 23న ఉదయం 6 గంటల నుంచి వేద పారాయణాలు, విశేష హోమాలు, 9.59 నిమిషాలకు బింబ స్థాపన ( విగ్రహ ప్రతిష్ఠ) అనంతరం పూర్ణాహుతి, అన్న సంతర్పణ ఉంటుందని తెలిపారు. 24న ఉదయం 10 గంటలకు శాంతి కల్యాణం, మహదాశీర్వచనం, ఆచార్యసంభావనం జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

# విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి



సమావేశంలో ప్రసంగిస్తున్న వెల్లూరు విట్ చాన్సలర్ విశ్వనాథన్, వేదికపై ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్, విట్ ఏపీ వీసీ కోటారెడ్డి తదితరులు

**విట్ చాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్**

ఏఎన్‌యూ: వ్యక్తి, కుటుంబం, సమాజం సర్వతోముఖాభివృద్ధికి విద్యే మార్గమని వెల్లూరు విట్ చాన్సలర్, మాజీ మంత్రి డాక్టర్ జి.విశ్వనాథన్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్వనాథన్ ప్రసంగిస్తూ మన సమాజంలో పేదరికం, అసమానతలు పెరగడానికి విద్య లేమి ప్రధాన కారణమన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశం నేటికీ పేదరికంతో కొట్టుమిట్టాడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ దేశమైనా అభివృద్ధి చెందితే, అక్కడి ప్రజలందరూ అభివృద్ధి చెందుతారని కానీ మన దేశంలో అలా జరగడం లేదని తెలిపారు. గడచిన 50 ఏళ్లలో సంపద, అభివృద్ధి అనే అంశాల్లో తీవ్రమైన అసమానతలు చోటు చేసుకున్నాయని చెప్పారు. మన సమాజంలో నేడు అణగారిన వర్గాలుగా ఉన్న 50 శాతం మంది వద్ద ఆరు శాతం సంపద ఉంటే, అగ్రస్థానంలో ఉన్న పది శాతం మంది వద్ద 63 శాతం, ఒక్క శాతం మంది సంపన్నుల వద్ద 31శాతం సంపద ఉందని వివరించారు. ఈ అసమానతల్ని అధిగమించేందుకు విద్య దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రతి వ్యక్తికీ జీవితంలో క్రమశిక్షణ, సహాయం చేసే తత్వం చాలా ముఖ్యమని, అవి లేకపోతే చాలా కోల్పోతామని తెలిపారు. విద్యార్థులు ఇంటర్మీడియెట్ తరువాత మూడు సంవత్సరాల కాలం చాలా క్రమశిక్షణతో మెలగాల్సిన అవసరం ఉందని సూచించారు. జీవితంలో కీలకమైన ఆ సమయంలో ఆనందానికి ప్రాధాన్యత ఇస్తే.. జీవితాంతం కష్టాలపాలు కావాల్సి వస్తుందని తెలిపారు. మంచికి ఉపయోగించుకోవాల్సిన డబ్బులతో జీవితాన్ని, ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. ఒక వ్యక్తి ఉన్నతంగా ఉండటంలో అతని ఆరోగ్యం, అలవాట్లు ఎంతో కీలకమని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యను కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు. విద్యా సంస్థ ప్రగతి, విద్యార్థుల భవిష్యత్‌లో గురువుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ప్రసంగిస్తూ విద్యార్థులు తమ విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తే వారి జీవితం ఉన్నతంగా రూపొందుతుందన్నారు. తమలో ఉన్న అనంతమైన సామర్థ్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. ఏఎన్‌యూలో ప్రతి విభాగంలో ఒక సెమిస్టర్‌కు కనీసం పది మంది విదేశీ అధ్యాపకులు, నిపుణులతో విద్యార్థులకు బోధన చేయించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విట్ ఏపీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎస్.వి. కోటారెడ్డి ప్రసంగిస్తూ కష్టపడకుండా ప్రత్యామ్నాయం లేదనేది విద్యార్థులు గుర్తించాలన్నారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ ప్రసంగించారు.

# జపాన్ పర్యటనకు ఏఎన్‌యూ ఫార్మసీ విద్యార్థుల ఎంపిక

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల విద్యార్థులు జపాన్‌లో పర్యటించనున్నారు. ఏఎన్‌యూకి ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డివిజన్ ఆఫ్‌ది టొయోమో ఫ్రిషెర్స్ గవర్నమెంట్‌తో ఉన్న సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులు ఎస్. శ్రావణి, జి. తేజేష్, ఏ. కృష్ణ పర్యటనలో పాల్గొననున్నారని ప్రిన్సిపాల్ ఎ. ప్రమీలారాణి తెలిపారు. ఫార్మసీ కోర్సులో మెరిట్ ఆధారంగా వీరిని పర్యటనకు ఎంపిక చేసినట్లు ఆమె చెప్పారు. ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు జపాన్‌లోని యూనివర్సిటీని సందర్శించి అక్కడ విద్యా విషయక అంశాల్ని అధ్యయనం చేస్తారని చెప్పారు. జపాన్ పర్యటనకు వెళుతున్న విద్యార్థుల్నిగురువారం వీసీ పి. రాజశేఖర్ అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి. కరుణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి. సిద్ధయ్య, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ చెన్నారెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ రాజశేఖర్

### డీఈఓ తనిఖీ


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ శైలజ

వేజండ్ల(చేబ్రోలు): విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని డీఈఓ పి.శైలజ చెప్పారు. చేబ్రోలు మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లోని విద్యార్థుల వద్దకు వెళ్లి ఎస్‌ఏ-1 పరీక్ష పేపర్లు ఇచ్చిన తీరును పరిశీలించి విద్యార్థులకు వచ్చిన మార్కులను పరిశీలించి అత్యధిక మార్కులు సాధించిన వారిని అభినందించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో విద్యార్థులందరూ యూనిఫాం, బూట్లు, బెల్టు ధరించి పాఠశాలలకు తప్పనిసరిగా వచ్చేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని అందరూ భుజించేలా కృషి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ వద్దని పేర్కొన్నారు. ఎస్‌ఏ-1 మార్కులు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను డీఈఓ తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను, విద్యా బోధనను పరిశీలించారు. స్థానిక హెచ్‌ఎం విజయశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఎల్‌ఐసీ పరిరక్షణకు కృషి



కొరిటెపాడు(గుంటూరు): ఎల్‌ఐసీ జాతీయకరణ దినోత్సవం సందర్భంగా అరండల్‌పేటలోని ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద గురువారం అధికారులు, ఉద్యోగులు, ఏజంట్స్ ప్రతిజ్ఞ చేశారు. ఎల్‌ఐసీని పరిరక్షించుకుని సంస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఆర్‌వీఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయోద్యమ స్ఫూర్తితో ఆవిర్భవించిన ఎల్‌ఐసీ నేటికి సుమారు రూ.42 లక్షల కోట్ల ఆస్తులతో అగ్రగామి ఆర్థిక సంస్థగా నిలిచిందని తెలిపారు. పాలసీదారుల సొమ్ముకు భద్రత కల్పించడంలో ప్రైవేటు బీమా రంగం ఘోరంగా విఫలమైన నేపథ్యంలో 1956లో ఆనాటి 245 ప్రైవేటు బీమా సంస్థల్ని విలీనం చేయడం ద్వారా ప్రభుత్వ రంగంలో ఎల్‌ఐసీని ఏర్పరిచారని వివరించారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జోనల్ అధ్యక్షుడు బి.మార్కండేయులు మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్యానంతరం ఏర్పడ్డ ప్రతి ప్రభుత్వరంగ సంస్థను సమూలంగా ప్రైవేటీకరించేందుకు యత్నాలు చేస్తోందని, అందుకు చట్టాలను సైతం మార్చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ డివిజనల్ సంయుక్త కార్యదర్శి వీవీకే సురేష్, నాయకులు జి.శివరామకృష్ణారావు, రవికుమార్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.